# షాజహానా కవిత్వం



## దర్దీ

97910

# డా॥ షాజహానా కవిత్వం

# షాజహానా కవిత్వం

## దర్దీ

**dardee**
selected poems
by dr shajahana

november 2012
1433 hijri

cover painting george underwood
cover design hema sundar

publishers
nasal kitab ghar

for copies
all leading book stalls
&
permanent address
dr dilavar
f/o dr shajahana
gandhi nagar
navabharat, paloncha
dist khammam 507 154

present address
10 1 639 chintal basti,
khairatabad, hyderabad 4,india
cell 94403 22361, 98854 20027, 99859 21379
e mail shajahana74@gmail com
www facebook/shajahana
price 75/

printed at
anupama printers
green view, 126, shantinagar
hyderabad 28 ph 040 23391364

894.82718
ACC No 97910
C-2543
500032

నాకు కవిజన్మ నిచ్చిన

అబ్బా. దిలావర్

అమ్మీ యాకుబ్బీ లకు

## షుక్రియా..

ఆపా షంషాద్ బేగం

స్కైబాబ

సుంకిరెడ్డి నారాయణరెడ్డి

ఓల్గా

'మట్టిపూలు' దోస్తులకు

కవితలు ప్రచురించిన పత్రికల వారికి

* దర్దీ షాజహానా కవిత్వం

# ఫేరీజ్


| | |
|---|---|
| చమ్కీ | 09 |
| బ్లాక్‌హోల్స్ | 11 |
| సిద్ధార్ధి | 13 |
| అబ్‌నార్మల్ పెయిన్ | 18 |
| ఆయేషా కోసం | 21 |
| తలెత్తుకునే అక్షరం | 23 |
| బేవఫా దునియాకో మాఫ్‌కరో సమీరా! | 25 |
| జఖ్మీ | 27 |
| మెహమాన్ | 29 |
| ఈద్ ముబారక్ | 31 |
| అలీఫ్ బే తే | 33 |
| హునర్ | 35 |
| జమానత్ | 37 |
| సంచారిణి | 40 |
| పాటగాడు | 43 |
| నా ఓనమా వి | 45 |
| అరణ్య | 47 |
| అన్వేషణ | 49 |


* దర్దీ షాజహానా కవిత్వం

| | |
|---|---|
| పూలు | 50 |
| మృత్యువుకో ప్రేమలేఖ | 51 |
| తారేఁ | 52 |
| ఆత్మాభిమానం నా సిరి | 53 |
| ప్రాణవాయువు | 55 |
| దేశాంతర దు ఖం | 57 |
| దర్గాదారికి అంటు లేదు | 59 |
| నల్ల బతుకు | 60 |
| మాదిగ బుచ్చమ్మ | 63 |
| మనసు మారని రంగు | 65 |
| తెల్లారని బతుకు | 67 |
| ఖర్మామిర్గా దోస్తానా | 69 |
| ది స్ప్రింగ్ ఈజ్ వెయిటింగ్ | 71 |
| ఫూల్ఝడి | 72 |
| ఎ జర్నలిస్ట్ నైట్ | 73 |
| అనిషేధ | 75 |
| బూషోడా గో బ్యాక్ | 77 |
| నువ్విప్పుడు నా భూమివి | 80 |
| మేరా హైదరాబాద్ | 83 |

* దర్దీ షాజహానా కవిత్వం

# చమ్కీ

కలల కుచ్చుముడివీడి
దారాలు దారాలుగా జీవితం
నాలుగ్గోడలకు రోజులను బిగించి
పటిపట్టి చేస్తున్న కలల కార్చోప్

రాత్రిచిక్కని చీకటిమీద
మెరుపులు మెరుపులుగా మెరుస్తున్న
కట్‌దానా కుందన్‌లను
ఆలోచనా జరీతో కలబోసి చేస్తున్న కార్చోప్

సాదా చమ్కీ  దేవదాసీ చమ్కీ
రకరకాల రంగుల మెరుపుకలలు

సాదా జీవితానికి
అరబ్ దీనార్లరంగుల కలలు
రాకుమారుడి రాక కోసం
ఆకాశం తానులో నేసిన నక్షత్రాల స్వాగతం

అన్ని చమ్కీలు చీరమీదకు చేరవు
దారితప్పి కింద పడి ఊడ్పులో మాసి
బజారులో ఎండకు మెరసి
ఏ గాలి వేగానికో
మురిక్కాల్వల్లో ఆత్మహత్య చేసుకుంటాయి

బతుకుచీరకు వేసిన కట్‌దానాలానో
బజారున పడ్డ చమ్కీలానో
ఏ ఎగుమతిలో ఎక్కడి దాకా వెళ్తుందో తెలియదు
ఏ బురద గుంటలో పడి మునుగుతుందో తెలియదు
కానీ మెరవడం దాని జీవలక్షణం
పాతబస్తీ నిండా మెరుస్తున్న చమ్కీలే

*డిసెంబర్ 2006, 'షాయర్' పొయిట్రీ బులెటిన్*

# బ్లాక్ హోల్స్

బ్లాక్ హోల్స్ గురించి చదివినప్పుడల్లా
నాకు
నీ కళ్ళ కింద అగాధాలే గుర్తొస్తాయి అమ్మీ !
ఎన్నో కళ్ళు వెలిగే వెన్నెల మతాబుల్లా
విరిసిన పున్నాగల్లా నిత్యం మెరుస్తూ   నాచుట్టూ
నీ నవ్వని కళ్లని గుర్తుతెస్తూ

ఆ బాధల లోయల్లో
పడి నేను రోజు ఒకసారైనా తప్పిపోతుంటాను
ప్రతిరాత్రి ఎందుకు జీవితాన్ని తవ్వుకుంటూ
తలపోస్తూ నిద్రను రాత్రికి అప్పగించేస్తావు
నువ్వు చీకటివై మేలుకుంటావు ?

కనిపించని మాంత్రికుడెవరో
కళ్ళకింద మసిపూసినట్లు

చందమామల్లాంటి ఆ కళ్ళకింద
సున్నితత్వాన్ని ఆక్రమిస్తూ
నల్లటి మేఘాల్లాంటి ఆ బ్లాక్ హోల్స్
నిన్ను నిర్వచిస్తూ
నన్ను నిలవేస్తూ

నునుపైన ఆ మైదానంలో
ఏ పదఘట్టనల చారికలో
ఏ యుద్ధాల నల్లని నీడలో
ఏ డేగల రాబందుల గోళ్లు గీసిన గీతలో
ఎన్నని చెప్పను?
నా మనసుని వెన్నపూసగా మార్చి
నల్లని సుడిగుండాలకి
మందుగా పూసి మాన్పాలని,
నీ కళ్ళు మిలమిలా చేపపిల్లల్లా
మెరుస్తుంటే చూడాలని
ఆశగా ఉందమ్మీ!

*24 09 2012 'అక్షరం' సూర్య దినపత్రిక*

# సిద్ధార్థ

జ్ఞానమూ నువ్వూ నేను
చీకటిని తవ్వుతూ పోతే ఎన్నెన్ని రహస్యాలో
అడుగడుక్కూ అజ్ఞాత శవాల స్పర్శ
ఇంకా అదృశ్య గొంతుకలెన్నో
అన్యాయాల గురించి చేస్తున్న విఫల చర్చలు

రాత్రిని పరుచుకుని పడుకుంటే
ఒక్క పొర్లుడుకే పక్క తొలగిపోతుంది
ఈ తుఫాను ఏ తీరం కోసమో తెలీదు
ఎంత ప్రేమ?
ఎల్లలు హద్దులు ఏవీ కనిపించని అంధత్వం

నీకోసం నేను చీకట్లో కాలు బయటపెట్టాను సిద్ధూ!
గంట కూడా కాలేదు
ఖండ ఖండాలైన దేహం చెత్తకుండీల్లో విసిరేయబడింది

నిరంతరం నీ ఆలోచనా ధారలో నేను
అయినా నీకెంత దూరమై ఉన్నాను !

జీవితాన్ని వెదకాలన్న తపన
నేను అమ్మ కడుపులోంచి బయటికే రాలేదు నీలా
ప్రపంచాన్ని స్పర్శించనే లేదు కానీ
నీ నా తేడా ఏదో నన్ను మురిక్కాలవలో తొక్కేసింది
ఒకవేళ పుట్టినా
ముళ్ళపొదల్నే అమ్మ పొత్తిళ్ళుగా ఎందుకు చేస్తుంది?
పుట్టగానే పారేసిన అమ్మే పలుమార్లు దోషి!
తిరుగులేని రాజముద్ర!

నువ్వే మంచివాడివి, దేవుడివి
ఉత్తమ పురుషుడివి, పాలకుడివి, అధికారివి
చాలా ఎక్కువగా భర్తవి తండ్రివి ప్రేమికుడివి
నేను నీవు చెప్పినట్లు వినే రోబోట్‌ని అంతే !

నేనెప్పుడూ నీకు దూరం కాలేదు
నీ ధ్యాసే జీవితమనుకునే వెర్రిప్రేమ

నవ్వుకోవడం నృత్యించడం దు ఖించడం
ఏది చేస్తున్నా
నా అవయవాలు మాత్రమే ప్రపంచానికి కనిపిస్తున్నాయి
నేను కనిపించడం లేదు

నేనో చెట్టుకోసం చూశాను
అక్కడి కొమ్మలు నన్ను అత్యాచారం చేశాయి

బడిలో గుడిలో భూమిమీది సమస్త ప్రదేశాలలో
ఇపుడు నా ఉనికి అంతరించిపోతున్న జాబితాలో ఉంది

ప్రేమలన్నీ పక్కలమీదే హత్యించబడుతున్నాయి
అయినను ప్రేమ పలుసార్లు పునరుజ్జీవించును

కొండకోనల్లో పులులు సింహాలతో ఆడిపాడే
గిరిజన పుత్రికల కౌశలం
మానవ సంచారంలో శవాలై తేలుతుంది
అడవుల్లో మెరిసిన ప్రతిభ
ప్రపంచమంతా ప్రతిఫలించక ముందే
ముక్కలు చేయబడుతుంది

ప్రేమ భావన ఇదీ అని ఆదిమానవులకు తెలుసో లేదో కానీ
ఆహారానికి మాత్రమే హత్యలుండేవి

ఇవాళ హాస్టళ్లల్లోనో, కాలేజిల్లోనో పుస్తకాల నీడన సేదతీరే
ఆదమరచిన అమాయక ప్రాణాల ఆయేషాల
హత్యలకు న్యాయం ఏనాటికి అందదు
చార్మినార్ పై నుంచి హత్యించబడిన పాతబస్తీ సమీరాలకు
ఆ దారిద్ర్యం నుంచి ఈ దేశ న్యాయం విముక్తినివ్వదు

బస్తీలల్లో, గల్లీల్లోనూ ప్రేమలు
జూకామల్లెతీగల్లా గోడల చాటున
గుసగుసగా పెరుగుతుంటాయి
ఏనాటికి జయహోధ్వానాలుండవు

నాణానికి  రెండో వైపు నీకు తెలీదు కదూ
నువ్వు వదలి వెళ్ళిన ఒంటరితనం ఆయుధంపదును
ఇప్పటికీ అదృశ్యంగా ఎన్ని హృదయాలను గాయపరుస్తుందో

నేనెంత అమాయకురాల్ని!
నీ క్రూరత్వాన్ని రూపుమాపటానికి
మౌనంగా ప్రేమపోరాటం చేస్తుంటాను
అందరిముందు పలచనైనా పర్లేదనుకుని
బహిరంగ దు ఖాన్నవుతాను

అర్ధంలేని మగమూర్ఖుల ఎగతాళి మాటలముందు
ఉద్యోగ ప్రస్థానాల కోసం ఎన్నోసార్లు
రాజీనామాలై జీవంలేని నవ్వుల్ని పూయిస్తుంటాను

చానళ్ళలోంచి బొట్లుబొట్లుగా నా రక్తం
నాలోకే చేరి మడుగు కడుతుంది
ప్రపంచం అందులోనే జలకాలాడుతుంది

ప్రేమ ఎప్పుడూ
రెండు హృదయాలలోంచి రావాలనుకునే పసికూన

యాసిడ్లు, కత్తులు, కిడ్నాపులై అహంకారం
జీవితాల్నే మింగేస్తుంటే
బతుకుల్ని మృత్యువుకేసి రాకేస్తున్న నీ కర్కశం ముందు

ఇంకే పశుజాతైనా నయమేననిపిస్తుంది
వత్తివత్తి పండును చేయాలనే మూర్ఖపు మెదళ్ళ ముందు
లేత మనసులు మాడిమసైపోతున్నాయి

ఇపుడు బతుకంటే క్షణం క్షణం భయపడాల్సిన కాడ
జాతి ఉనికికే ఇంత ముప్పును తెస్తున్న వేళ
నువ్వేం పోగొట్టుకుంటున్నావో నీకర్ధమయ్యేసరికి
నన్ను బంగారపు బొమ్మగానో, రాతిశిలగానో చూసుకోవాలి
లేదా హృదయం లేని నీలాంటివారినే నువు క్లోన్ చేసుకోవాలి

ఇప్పటికే ఒకరికోసం ఒకరం బతికే క్షణాలన్నీ పోగొట్టుకుని
ఖాళీ హృదయాలతో ఒకరిముందు ఒకరం నిలబడ్డాం

ప్రేమెప్పుడూ నన్ను కవ్విస్తూనే ఉంది, మోసగిస్తూనే ఉంది

ఈ భూమి మీద నీ పాదమెంతో నా పాదమూ అంతే!
అయినా కాలు బయటపెట్టడానికి నాకు అవకాశమే లేదు
అప్పుడే కాదు ఇప్పటికీ
నిజమే జ్ఞానం కావాల్సింది నీకే
అలసిన నా మనసు ఆనుకోవడానికి ఇక్కడ స్థలం లేదు
మరో గ్రహం ఏదైనా ఉందేమో వెతుక్కోవాలి!

*29 11 2010 'వివిధ' ఆంధ్రజ్యోతి*

# అబ్‌నార్మల్ పెయిన్

వర్షం వచ్చేట్లుంది
రెండు ముక్కలైన ఆకాశాన్ని
కలిపి కుట్టేసినట్లు మెరుపు
మబ్బు దట్టంగా కమ్మిన మనసు
పరీవాహక ప్రజలారా! పారిపోండి

***

ఏడేడు సముద్రాల కవతల
పంజరంలో రాకుమారీ
నా స్నేహితురాలా   సహేలీ
నన్నెత్తుకు లాలించిన రెండో అమ్మా
నా కవితలకు ఆత్మా ! నా ఆపా!
ఎవరూ లేని ఎడారుల్లో  సముద్రాల్లో
సహచరులే కదా ఓదార్పు!
భాగస్వాములే అర్థం చేసుకోలేని కాడ
ఒక్క ప్రేమ పలకరింపు లేని కాడ
ఇరుగు పొరుగు స్నేహితులే
అమ్మా నాన్న అక్కా చెల్లీ!

నేను ఓదార్పులేని క్షణాలన్నీ
కన్నీళ్ళై కత్తులై గుండెల్ని గుచ్చేస్తున్నాయి
మన కలవలేని దూరమంతా
కట్లపామై నన్ను చుట్టలు చుట్టుకుంటుంది

కట్టుకదల మాటలు చెప్పి నవ్వించలేని
నా వాగుడుకాయతనం
నోట మాటలేక స్థాణువై చూస్తుంది!

ముప్పయ్యేళ్లకే మూడు సిజేరియన్‌లై
నువ్వెంత నరకయాతన ననుభవించావో
నాకు అవసరం లేకున్నా వళ్లంతా
ఆక్యుపంక్చర్ చేసినట్లుంది

'అటజనికాంచె భూమి ' తెల్లారుఝామున లేపి
కష్టమైన పద్యాలన్ని ఇష్టంగా నేర్పించిన అమ్మీ అబ్బా
కష్ట కాలంలో ఏం చేయాలో నేర్పలేదే?
అవునూ అన్నీ అబ్‌నార్మల్
మన జిందగీలే అసాధారణాలు
చదువు ముక్కలై
నిఖాయే పరమావధైనపుడు
నీ కడుపు నొప్పిలానే ఈ అబ్‌నార్మల్ పెళ్లిళ్లు

చెప్పకుండా నొప్పి చేసే దాడిలో
ఒక్క శరీరమే ధ్వంసం అవుతుంది
మరి మనసుకు పడ్డ నెర్రెల్ని
ఏ డాక్టరొచ్చి కుట్లేస్తాడు

పాత జ్ఞాపకాలన్నింటినీ పేర్చి
మనసు బొంత మీద పడుకున్నాను
వాంతి చేసుకున్నాక నీ వొళ్లో సేదతీరినట్లుంది

ఆపా !

ఈ మగవాళ్లు ఇంత కఠినులెందుకు?
విదేశీ మారకంలో మాటనే కాదు
మనసునే కాదు మానవత్వాన్ని
డాలర్లుగా చెలామణీ చేస్తున్నారెందుకు
ఎందుకీ రాక్షసత్వం?

ఆకాశం ఉరుముతోంది !
'మనసుకొకం తోడుంటే బాగుండు
శరీర మంతా చీరేసినా భరించేదాన్ని'
విలవిల్లాడిన నువ్వే కళ్లల్లో మెదుల్తున్నావ్!
కట్ చేసి పారేసిన రక్తపు ఉండలా
ఈ కాలాన్ని కట్ చేస్తే బాగుండు!

'సగమే అదృష్టవంతురాల్ని
మనసులో ఉన్న అబ్‌నార్మల్ పెయిన్‌ని
జీవితాంతం అనుభవించాలి'
ఫోన్‌లోంచి సుడులు తిరిగిన బాధ
తరంగాలుగా
'గుడియా' ఒక్కత్తేనా
ఓటిపోయిన లక్షల గుడియాలు
బతుకుతూ చస్తూ

లోపల గడ్డ కట్టిన దేదో కరుగుతోంది
కుండపోతగా వర్షం !

(ఆపా 'షంషాద్ బేగం'కు, విదేశాలలో ఉన్న తన లాంటి అక్కలకు )

29 7 2007 ఆదివారం ఆంధ్రజ్యోతి

# ఆయేషా కోసం..

కొంగు చాపి గడప గడపకూ తిరుగుతుందా తల్లి
తమ్ముడు తనవాడైనా ధర్మం తప్పని దేశమంటూ
గొప్పలు చెప్పిన పారాలు
ఇప్పుడు శవాల చాటున మురిగిపోతున్నాయి
ఆ అమ్మ న్యాయం కోసం ఒక్కో తలుపూ తడుతూంది
ఇప్పుడందరూ మాట్లాడండి
ఆయేషాల్లాంటి మన పిల్లల కోసం!
సాక్ష్యాలను తారుమారు చేసిన పోలీసుల్లారా
ఆయేషా కూడా అచ్చం మీ పిల్లల్లాగా నవ్వుతూ తుళ్లుతూ
ఆ అమ్మ కలలకు ప్రతిరూపం కదా
ఎందుకురా బతికుండగానే ఆ తల్లిని చంపేస్తున్నారు
నిండుగా పూసిన పున్నాగ పూల
చెట్టులాంటి కూతురి వెన్నెల నవ్వు రాలి
కోటి దీపాల కాంతి నింపుకున్న కళ్లు మూతలు పడి
అమాస చీకట్లైపోతే
ఏ ముచ్చటా తీరకుండానే మట్టిలో కలిసిపోతే
గుండెలు బాదుకుంటుందా పిచ్చితల్లి
ఇంకెవరికీ ఇలా జరగొద్దంటుంది
అమ్మ మనసు కదా !

రాజకీయం దున్నపోతుల కొట్లాటల్లో
మనకి దెబ్బలు తప్ప న్యాయం ఎక్కడ జరుగుతుంది తల్లీ

అయినా చంపబడింది ఆయేషా కదా తల్లీ
న్యాయానికి కూడా మతముంటుందేమో

మా ఇళ్లల్లో చదివించడమే తక్కువ
చదవాలని వచ్చే ఒకరిద్దరినీ రాకుండా చేయకండిరా
అవసరం లేని వాటికోసం
యుద్ధం చేసే హైదరాబాదీ వీరుల్లారా!
మతం కోసం తెగ తాపత్రయపడే నటనా ధీరుల్లారా!!
హృదయవిదారకంగా పడివున్న
ఆయేషా శవం మీ కళ్ల పడలేదా
వినపడడంలేదా ఆ తల్లిదండ్రుల ఆర్తనాదం?

***

ప్రపంచమంతా తలలు దించుకునేంత
పాశవికంగా హత్యాచారం చేసినా
న్యాయం కళ్ళ గంతలు చాలవని
రాజకీయాన్ని కూడా పరదా కడుతున్నారు
న్యాయం చేతులకంటే మతం చేతులు పొడుగైనవి
మతం కంటే రాజకీయం చేతులు
ఇంకా పొడవైనవని తేల్చారు
ఎవరికీ ఎవరినీ కాపాడే మానవత్వం లేదు
ఇదంతా ఎందుగ్గానీ
మీరు మాకు న్యాయం చెయ్యలేరు
మమ్మల్ని కాపాడలేరుగానీ
ప్రతి అమ్మాయి ఉయ్యాల తొట్టెకి
ఒక తుపాకిని మంజూరు చెయ్యండి చాలు!

*31 03 2008 'వివిధ' ఆంధ్రజ్యోతి*

# తలెత్తుకునే అక్షరం

ఇక్కడ అక్షరం మొగ్గేస్తుంది
నీ దాకా పరిమళాన్ని పంపిస్తున్నాను
నీవు గ్రహిస్తావో లేదో?
వృధా అవుతుందో ఏమో?
నా బాధో సంతోషమో
నా విరహమో ప్రేమో మోహమో
నేనూ సముద్రాన్నే
నాలోనూ ఉప్పునీరుంది పోనీ అవో
నేను తేనె తుట్టెననుకో తేనెలాంటి భావధారో !
ఏదో ఒకటి బతుకో మరణమో

ఒక భావం నీలో విరియడానికి
ఇన్నిన్ని రంగుల్ని నా మనసు మోస్తుంటుంది
ఒక్కోసారి అనుకుంటాను
అక్షరం మొగ్గేస్తున్నప్పుడే
నువ్వు ప్రపంచంలో ఎక్కడెక్కడో
రకరకాలుగా తయారయ్యే ఉన్నావని
కానీ మళ్ళీ సందేహం
ఈ గాలిపటం
నువ్వున్న ఆకాశం దాకా వస్తుందో రాదో
నా కంటి ఉప్పునీరు
నీ దోసిలిలో ఘనీభవిస్తుందో లేదో

భూమి పరిభ్రమిస్తూనే ఉంది !
మూడు కాలాల తడిని
చలిని వేడిని కవిత్వంలో నింపాను
ప్రకృతిని విశ్వాన్ని కూడా
అక్షరాలలో తర్జుమా చేయాలనుకునే
అనువాదకురాలిని నేను
ఈ భాష నిన్ను చేరుకుంటుందో లేదో
ఇక్కడ అక్షరం మొగ్గేస్తుంది
పరిమళం ప్రపంచమంతా వ్యాపించాలని ఆశ!

అక్షరానికి ముసుగులు తొడగలేను
అక్షరం సజీవ కదా!
ఇంకెవరైనా ముసుగు కప్పుకున్నా సరే
చీల్చుకుని లోపలి కొస్తుంది !
అక్షరం సర్వ వ్యాపితం కదా

పూలు విసిరినా కత్తులు విసిరినా
అక్షరం మొక్కవోదు
హృదయాల తర్జుమా ఆగిపోదు
ఉరుములు మెరుపులు ఏమైనా సరే
మొగ్గలు వికసిస్తాయి
అక్షరాలు తలెత్తుకునే ఉంటాయి !

తస్లీమాకి ప్రేమతో
ఆగస్టు 2010 'సురభి' పత్రిక

# బేవఫా దునియాకో మాఫ్ కరో.. సమీరా!

చార్మినార్ కంటే ఎత్తైన కట్టడం
ఏదైనా చూడాలిప్పుడు
ఈ ప్రభుత్వాలు కళ్ళు తెరవడానికి
పాతబస్తీ జనానా వెతలు చూసి
చార్మినార్ కూడా రాల్చుకుంటుంది
హృదాయాన్ని పెచ్చెలు పెచ్చెలుగా !

పట్నానికో పాతబస్తీ !
ఎంతమందో అమీనాలు గుడియాలు సమీరాలు
ఇంకా కనిపించని పేర్లెన్నో

సిగ్నల్‌లైట్ల కాడ బురఖాలో
హైదరాబాదీ నవాబితనం తనఖా
ఆ దారుల నుంచే ముఖ్యమైన మంత్రులు
రాజులూ రాజ్యాధికారులూ !

నాలుగొందలేళ్ళ ప్రత్యక్ష సాక్షి ఎదురుగానే
సవితి ప్రేమను చవిచూస్తున్నం
పాతబస్తీ తరఫున మౌనంగా
నిరాహారదీక్ష చేస్తూ నిలబడ్డ చార్మినార్
నాలుగు చేతులతో
        నిరసన వ్యక్తం చేస్తున్న చార్మినార్
    ***
మాకు దూరం చేసిన చదువు
            నయా పూల్ మీంచి
నడుచుకుంటూ రావాలి
అపుడు మేం అమాయకంగా
            చావు మెట్లు ఎక్కం
అందనివ్వని అంగూరుల్లాంటి
        అక్షరాలను అందుకుంటాం !
చమన్‌ల లాంటి జిందగీలను
మేమే అందంగా నిర్మించుకుంటాం!

(చార్మినార్ మీంచి నెట్టేయబడి హత్యకు గురైన సమీరా కు)

# జఖ్మీ

ప్రశాంతంగా నిద్రపోయి చాలా రోజులయింది
నా కన్నీళ్ళు తుడవడానికి
చేతిరుమాలుతో చేతి సరంజామాతో రాకు
గాయపడడాన్ని ఊహలో కూడా ఊహించలేను
అది నేనయినా నువ్వయినా!
కానీ నేనెదురయినపుడు మాత్రం
హృదయాన్ని స్వచ్ఛంగా ఉంచు!

సుడిగుండాలు సునామీలు వస్తుంటాయ్ పోతుంటాయ్
బద్నాం అయిన ఈశ్వరల్లా !
ప్రాణాలు మాత్రం మనవే కదా?
రక్తం ఎగిసి పడేయబడిన ప్రతిసారి
మన కాళ్ళకింద భూమికి చీలికలొస్తుంటాయ్
ముక్కు మూసుకోవడం కోసమే చేతిని ఉపయోగించకు
చేతులను కలుపుకుని గట్టిగా నిలబడదాం

ఇద్దరివీ గాయాలే
ఇప్పుడొక్కరి మీదే కత్తులు దూస్తే ఏం లాభం

మనకిప్పుడు 'సాధ్వీ'మణులు, 'పురోహితు'లు, జిహాదీలు వద్దు!
మనుషులు కావాలి ఒట్టి మనుషులు
కోపం వస్తే కొట్టుకుని మళ్ళీ కలిసి పోయే
వీధి కుక్కపిల్లల్లాంటి మనుషులే కావాలి !
దు ఖమొస్తే అన్నా భయ్యా అని పట్టుకునేడ్చుకునే
హిందూ ముస్లిం కుటుంబాలు కావాలి

'పక్కనే మృత్యువుంది అనుమానాస్పద ప్రవర్తన ఎవరినీ నమ్మకండి'
అపనమ్మకాలని పేలుస్తున్న ఉగ్రవాదాన్ని దూరం చేద్దాం!

ఛిద్రఛిద్రమవుతున్న శాంతిని
ఉలిక్కిపడుతున్న నగరాలని
మన సహనంతో సహజీవనంతో బతికిద్దాం!
బిడ్డల రక్తంతో తడుస్తున్న భూమాత సాక్షిగా
నువ్వొత్త చేతి రుమాలుతో, చేతిలో నీళ్ళబాటిళ్ళతో రాకు
స్వచ్ఛమయిన హృదయంతో రా
అలాయిబలాయి తీసుకుందాం!

*బాంబే 'తాజ్' హోటల్ సంఘటన సందర్భంలో*

*'అక్షరం' సూర్య దినపత్రిక*

# మెహమాన్

నేనన్నాను అతిథికి స్వాగతం
అతనన్నాడు నేను శరణార్థిని
ఒకానొక గుంపు వేట నుంచి
తప్పించుకున్న పావురాన్ని !

నేనతన్ని మెహమాన్ గానే చూశాను
అతనికేం వడ్డించాలో అర్థం కాలేదు
అతనికేం ఇష్టమో అడిగాను
'నా కుటుంబంతో కలిసి తినడం' అన్నాడు
లోపలేముందో తెలీని
పూడుకుపోయిన బావిలా ఉన్నాడు
పెట్టింది అన్నమేనా ?
నమ్మకం కోల్పోయిన బెదురుచూపులతో సందేహిస్తూ
ఇంకా ఎక్కడి నుంచో పొగ వస్తూనే ఉందన్నాడు !
రెండు ముద్దలు కెలికి
మెతుకు మెతుక్కూ కుటుంబాన్ని కలవరిస్తూ
తింటున్నట్లు లేదు ఏతమేసి
అంతర్లీన సముద్రాల దుఃఖాన్ని తోడుతున్నట్లున్నాడు

అతనిక్కడ ఉన్నట్లే ఉన్నాడు
కానీ ఎక్కడో సంచరిస్తూ
ఇంకా దొరకని తమ్ముడు ఎత్తుకెళ్లిన అక్క
ధ్వంసమైన కుటుంబాలు
దూరమైన వతన్ పలవరింతై
నామరూపాల్లేని తమ గల్లీని
నాశనమైన దోస్తులని
రూపు కోల్పోయిన ఊళ్లని
చిందరవందరైన జాతిని తలచి
కళ్లు రెండూ సరిపోక
సమస్త దేహంతో దుఃఖిస్తున్నట్లున్నాడు ।

చివరికి శబ్దం కాకుండా
ఎలా వచ్చాడో అలాగే వెళ్తూ ఒక మాటన్నాడు
'రక్త దాహం ప్రమాదకరమైన అంటువ్యాధి'

(మా ఇంటికొచ్చి వెళ్లిన *'షఫీ గుజరాతీ'* లాంటి బాధితులకు)

*17 12 2007* 'వివిధ' ఆంధ్రజ్యోతి

# ఈద్ ముబారక్

నెలవంక నుంచి
నెలవంక దాకా మా ప్రస్థానం
ఎన్ని అమావాస్యలొచ్చినా
నెలవంకనే కొలిచే వాళ్ళం!
చిన్నచిన్న గదులల్లో
మేం ఎంత ఇరుగ్గా బతుకుతున్నామో
మనిషిపట్టేంత సందు మాత్రమే
ఉన్న మా గల్లీకి రండి
సమాధుల పక్కనే
సిజ్దాలో స్థిరపడిన మా రేకుల గుడిసెను చూడండి
మజీదులెన్ని కూల్చినా
గుజరాత్ లెన్ని సృష్టించినా
నెలవంకని తలచేవాళ్ళం
పసిపిల్లలతో సహా రోజూ రోజా నే !
పండుగ నెల్రోజుల మాట వేరు కదా
మాకు ఉపవాసం కూడా పండుగే
పండుగ కానుక పెద్దోళ్ళు చిన్నోళ్ళకిచ్చే ఈదీ
ఉన్నవాళ్లు లేనోళ్లకిచ్చే ఈదీ
ఎవరో ఇచ్చిన బట్టలు కావచ్చు
ఎవరింట్లోనో మిగిలిన బిర్యాని ముద్ద కావచ్చు
పది రూపాయల కాయితం ముక్క కావచ్చు
పండగ సంతోషం మాత్రం మాకు వెలలేనిది
నెలవంకని కొలిచే వాళ్ళం కదా
రంజాన్ అంటే పళ్ళన్నీ బండ్లమీద పావురాల్లా వాల్తాయి

పళ్లతోనే రోజా విప్పుతామనుకున్నారా
ఎడారి జీవితాన ఒకే ఒక్క ఖర్జూరా కావచ్చు
బత్తాయి ముక్క కావచ్చు
ముదర పండిన అరటి పండు
అదీ లేకుంటే చిన్న ఉప్పుగల్లు!
అల్లాని తప్ప ఎవరినీ ఏమీ అడగని వాళ్ళం
పరలోక ధ్యాసే తప్ప
ఇహలోక సౌఖ్యాల గురించి పట్టించుకోనివాళ్ళం
రిజర్వేషన్లిచ్చినా ఇవ్వకున్నా క్యా ఫరఖ్
సవాలక్ష అమావాస్యల్లో ఇదొకటి
నెలవంకని కొలిచేవాళ్ళం
ఏడాదంతా దాచిపెట్టుకున్న
కలలన్నీ చమ్కీ బట్టలై
ఆ చమ్కీల వెనుక
కన్నీళ్ళెందుకో తళుక్కున
డిసెంబర్ ఆరున భూమిలో కలిసిన
పావురాళ్ళ కోసమేమో
గుజరాత్‌లో బూడిదైన జ్ఞాపకాల కోసమేమో
ఇరాక్ ఏ మూలో గుచ్చుకుందేమో
అయినా
మమ్మల్ని పట్టించుకోని ప్రభుత్వాలకు
ఓటుబ్యాంకులు చేసిన రాజకీయాలకు
మమ్మల్ని నిర్మూలించాలనుకునే వాళ్ళకు
ఇరాక్ నెత్తుటి కూడు తింటున్న బుష్‌లకూ
మూర్ఖులకూ మంచి వారికీ అందరికీ
ఈద్ ముబారక్!

*'ప్రజా సంస్కృతి' ద్వైమాస పత్రిక, డిసెంబర్ 2004*

# 'అలీఫ్ బే తే'

పూల రెమ్మల్ని పోగేసి
'పరీ'లు నాజూకు  వేళ్లతో
కాశ్మీరీ ఎంబ్రాయిడరీ ఏదో చేసినట్లు
లిపి అల్లికల్లో దూరి మనసు వెనక్కు రానంటుంది

నెలవంకల్ని కుప్పేసి
'అలీఫ్ బే తే' ల్ని సృష్టించినట్లు
వెన్నెల సోనలేవో నన్ను
అవ్యక్త పరిమళాల్లోకి లాక్కుపోతాయి

నాజూకు పరీలంతా చేతుల్లో
చేయేసుకుని వనవిహారంలో మునివేళ్లపై
నాట్యం  చేస్తున్నట్లు
అక్షరాలు నన్ను కవ్విస్తూ పిలుస్తుంటాయి

అడవిలో తప్పిపోయిన మనసుకు
సేదతీర్చే శయ్యల్లా
చూడగానే దేహమూ హృదయమూ విప్పారుతాయి

కానైతే పల్లెల్లో
మూలమూలా వెదికినా దొరకదు నా భాష
ఏ సర్కారీ బడిని తట్టి చూసినా
నాలుగు ఉర్దూ అక్షరాలు
ఎక్కడా కళ్ళని స్పర్శించడంలేదు!
నాది కాని భాష ఇవాళ నన్ను ఏలుతున్నది!
నా ఇంటిని నా నాలుకను ఆక్రమించింది!
నా భాషకు నాకు
కాంతి సంవత్సరాల దూరాల అగాధాలను సృష్టించింది!
ఏ పనికిరాని పరాయి సంస్కృతాన్నో
అందలం ఎక్కించాలని ప్రయిత్నిస్తున్న నాగరీకులు

ప్రాణాప్రాయంలో ఉన్న నా భాషకు
మంచినీళ్ళు పోసి బతికించాలని మాత్రం
ఎవరూ చూడ్డం లేదు !
ఎవరికీ అనిపించడం లేదు!
ఉర్దూ లాంగ్వేజ్
మేడ్ ఇన్ ఇండియా!
అంతరించి పోతున్న వాటిల్లో
నా భాష కూడా
మ్యూజియంలో !
ఇప్పుడు అమాంతం చిన్నపిల్లనై
'అలీఫ్ బే తే' లు నేర్చుకోవాలని
మనసు మారాం చేస్తున్నది !

*26 06 2011* ఆదివారం ఆంధ్రజ్యోతి
* పరీ దేవకన్య

# హునర్

అర్ధరాత్రి వరకూ సాగే
జీవన వాయిద్య ఒంటరి కచేరి!
చదువూ సంధ్యాలేని
పొడి జీవితాలకు తెలిసిన
ఒకే ఒక్క అత్యాధునిక విద్య!
మోకాళ్ళ చిప్పలు అరిగిపోయాయి
బచ్చేదానిలో నొప్పి మంట!
ఎన్నిసార్లు చెప్పాలమ్మా మిషిన్ కుట్టొద్దని ?
మూడవ నెంబర్ ప్రమాద సూచికను ఎగరేసే డాక్టర్లు
గుడ్డనైతే ఇష్టం వచ్చినట్లు
కత్తిరించి కుట్టగలం కానీ
జిందగీ అలాకాదే !
పనికిరాని గుడ్డనికూడా
గౌనుగానో జాకెట్‌గానో కత్తిరించగలం
జీవితం ఉందే
ఎటునుంచీ నరుక్కురాలేకున్నాం!
వేసుకున్న బట్టల్లో
ఎవరి గుడ్డముక్క గురించి వాళ్లు మాట్లాడుతుంటే
బరిబత్తలయ్యే మా బాల్యం

తలపెట్టుకుని ఏడుస్తుంటే
మిషిన్ బల్లే అమ్మ ఒడి!
'ఫాషన్' 'షీస్' పేర్లు పెట్టుకుని
పెద్దపెద్ద మేడమ్‌లు
షాపులు తెరచీ బ్యాంక్ బాలెన్స్‌లు తెరచీ వాళ్ళు
తడారిన నోళ్లు తెరచుకుని మేం
ఎక్కడ లూజుందో టైటుందో సైజు చేయగల మేము
అసలు లోటుపాట్లెక్కడ్నో కనుక్కోలేకున్నాం
అసలు కుట్టుకోవడమే
జీవితానికి పరమావధి ఎందుకైందో !
అసలెందుకు మా బతుకులు
మిషిన్‌తాళ్ళకే ఉరేయబడ్డాయో?

మాకిప్పుడు అవమానాల్లేని బాల్యం కావాలి
ఆకలిదప్పులు తీరే భరోసా కావాలి
మేము డాక్టర్లు ఇంజనీర్లు కావాలి
ఐఏఎస్‌లు ఐపిఎస్‌లు కావాలి
మాకిప్పుడు కొత్తజీవనోపాధులు కావాలి

*డిసెంబర్ 2006 'చమన్' ముస్లిం సామాజిక పత్రిక*

# జమానత్

కాలం ఎలా గడిచిందో ఏమో?
నేనే బలవంతంగా తోశానేమో?
35 సంవత్సరాలుగా నాకు
అంటిన అత్తరు మరకలేం లేవు
అంతా నెత్తుటి మరకలే

ఊహ తెలిశాక మసీదు కూల్చబడింది
కులాలు మతాలు రాజకీయాలు
నా బాల్యం తెల్లటి మస్తిష్కపు తెరమీద తోలుబొమ్మలాడాయి
భూగోళం గుండ్రంగా పరుచుకున్న చుట్టీస్ అండ్ లాడర్స్ పటం
యవ్వనం దూకింది మతం గోడల మీదుగా
డొక్కుపోయిన అనుభూతులు

ఇంటికీ ఇంటికీ మధ్య మూరెడు గోడే
కానీ అకాశం భూమిలానే
గుజరాత్‌లో కాలిన శవాలు ఇప్పుడిక మాట్లాడలేవు
రాశిపోసింది కాలం దుమ్మును

మనం ఇప్పుడు ఏమైనా మాట్లాడొచ్చు
ఎన్ని చూశాను మూడు దశాబ్దాలకే
ఇంత 'సమన్యాయం' కనపడుతున్న కళ్ళకి
చరిత్ర ఒక ఓటికుండ

నా దేశం అభివృద్ధి పథాన నడుస్తుంది
ఆకాశంలోనే కాదు నీటిలో పాతాళంలో కూడా
వేదమంత్రాల సాక్షిగా వదిలిన సబ్‌మెరైన్
ఢీకొట్టింది నా గుండెనే
మొదటగా ప్రయోగించబడింది నా రక్తంలోకే !

నా స్వేచ్ఛ ఇంకెవరి పూచికత్తుకో తాకట్టు పెట్టబడ్డాక
నా ఉనికి పౌరసత్వం ఇంతగా ఎగతాళి చేయబడ్డాక
నా వయసు నన్ను వెక్కిరించింది భయపెట్టింది
లోపల చెయ్యేసి కవ్వంలా చిలికి రక్తాన్ని గడ్డలుకట్టించి చితక్కొడ్తుంది

నేనింకా ఎంతకాలాన్ని వెనక్కి తొయ్యాలో తెలీదు
నా మనసు నిండా రక్తం మరకలే
సంవత్సరాల తరబడి కరగని
చాక్లెట్‌లా నోట్లో నానిన ప్రతిజ్ఞ పాఠ్యపుస్తకాలు
గురువులు నన్ను పెంచిన సమాజం ప్రశ్నార్థకాలై
లౌకిక స్వేచ్ఛపై పర్దాలై వేలాడుతున్నాయ్

పుట్టాక నా తాలూకు మాయను పాతిపెడితే ఆప్యాయంగా
తనలో కలుపుకున్న ఈ మట్టి బిడ్డను నేను !
నా తల్లిమట్టి మీదనే ఇవాళ పూచీకత్తు అడుగుతున్నారు ?
నా పర్‌దాదా నానాల నానీదాదీల రక్తంతో చెమటతో
తడిసి మురిసిన భూమి ఇది!
నా సోదరసోదరీల రెక్కల కష్టంతో
బండెడు చాకిరీతో నడుస్తున్న దేశమిది!
నాకిప్పుడు చాలా సందేహాలున్నాయి
ప్రజాస్వామ్యం అంటే ఏంటి?
లౌకికరాజ్యం అంటే ఏంటి?
భారతీయులంటే ఎవరు?
జవాబులు కావాలి

ఈ మూడున్నర దశాబ్దాల జీవికి అంటిన
అత్తరు మరకల కంటే నెత్తురు మరకలే ఎక్కువ
ఎవరు దీనికి పూచీకత్తు?

(భారత్‌లో మతస్వేచ్ఛ నేతిబీర అని వాచ్‌లిస్ట్ (అంతర్జాతీయ మతస్వేచ్ఛపై ఏర్పాటైన మిషన్ యూఎస్‌సిఐఆర్‌ఎఫ్)లో భారత్‌ను చేర్చినందుకు సిగ్గుపడుతూ విశాఖలో సబ్‌మెరైన్‌ను వదిలిన సందర్భంగా ముస్లింలపై విధించిన ఆంక్షలను తీవ్రంగా నిరసిస్తూ )

*07 09 2009 'వివిధ' ఆంధ్రజ్యోతి*

# సంచారిణి

ఒక బీభత్స దృశ్యాన్ని మోస్తున్న తెరని
మనుషులు తిరుగుతున్న ఊరుని
చేపలు ఈదుతున్న చెరువుని
స్నేహితులు తిరుగాడిన మైదానాన్ని
కన్నీళ్ళను మోస్తున్న మేఘాన్ని
జ్ఞాపకం లాగగానే కురుస్తున్న పూలవర్షాన్ని

నాతోపాటు
ప్రతి ఊరి జ్ఞాపకాన్ని లాక్కొస్తున్న నత్తగుల్లని

బడులు గుడులు మసీదులు చర్చిలు
అన్నింటినిండా నిండిన స్నేహితులు
ఊరిపక్కన మెలితిరిగి ప్రవహించిన వాగు
బైరాగిలాగ నిల్చున్న గుట్ట
ఆకాశాన్నించి కొంత ఎర్రదనాన్ని
అప్పుతెచ్చుకున్న దిబ్బ
రహస్యంగా తెరచిన గూడెం హృదయంలోకి
ఆత్రంగా వేసిన అడుగులు

వదిలేసిన బతకమ్మలు, ముగ్గుల్లో పెట్టిన గొబ్బెమ్మలు
రేగ్గాయలు మామిడిపిందెలు
పున్నాగపూలు, జాజిపూల పరిమళాలు
వంటినిండా పారుతున్న జ్ఞాపకాలు
చుక్కలచుట్టూ ముగ్గుతీగలు తిరిగినట్టు
ఎక్కడునుంచి ఎక్కడిదాకో

ఎప్పటికీ మరచిపోవద్దంటూ
ఇచ్చుకున్న నెమలీకల సుతిమెత్తని మనసులు
పట్టీగజ్జెల గుత్తులు, పుస్తకం మధ్యలో
ఎండించి శాశ్వతం చేసిన బంతిపూరేకుల వాగ్దానాలు

మళ్ళీ రావాలి ఆశతో చెప్పే వీడ్కోళ్ళు
మళ్ళెపుడూ కలవని ఆ ముఖాలని మనసు మధ్యలో
శాశ్వతం చేసుకోవాలనే తపనలు

బడికెళ్ళేప్పుడు పుస్తకాలసంచీ
సర్దుకుని రెడీగా ఉన్నట్టు
మనసును సర్దుకుని
ఎప్పుడంటే అపుడు అందర్నీ
అన్నింటినీ వదిలి మరచి
కొత్త బడికి కొత్త ఊరికి పోవాలి

ఊరి నుంచి ఊరికి
అబ్బా ట్రాన్స్‌ఫరయిన ప్రతిసారి
సామానుతోపాటు జ్ఞాపకాలను మూటకట్టుకునే దాన్ని
ఒక్క శాశ్వత చిరునామా లేదు
ఒక్క శాశ్వత స్నేహమూ లేదు
ఒక్క శాశ్వత జ్ఞాపకమూ లేదు

ప్రతి ఋతువులో మారుతున్న తోటలా
తోటలోకి వలస వచ్చేపక్షిలా
కొత్తతోటల్ని వెదుక్కుంటూ
నన్ను నేను మోసుకుంటూ ।

*04 06 2012* 'వివిధ' ఆంధ్రజ్యోతి

# పాటగాడు..!

నిద్రరాని రాత్రి నిశీధిని
మంచు తెర కమ్మిన గొంతుతో పిలుస్తాడు
ఏటివాలుకెదురుగా పాటని పరిగెత్తిస్తాడు
పాట పడవై ప్రయాణిస్తూ ఉంటాను
పాటగాడా !
నీ గొంతు మీద ఎవరి పేటెంటూ లేనందుకు
అమితంగా సంతోషిస్తాను
ఆఖరికి నాది కూడా
రవ్వలేరుకుంటాను కాని
అగ్నిని మూట కట్టుకోలేను కదా
చలికి వణికే దేహంపై పాటలను కప్పుతాడు
ఎవరూ అడక్కుండానే
అప్పుడతని మనసులో నెమళ్ళాడుతుంటాయి
సెలయేళ్ళ ఘోష వెదురు వనాల సవ్వడి
ఎండిన జ్ఞాపకాలను ఆకుపచ్చగా తిరగదోడతాడు

ప్రపంచంలో అతని గొంతు అడుగు పెట్టని
ప్రదేశం లేదని అర్థమవుతుంటుంది
గొంతుతో ప్రపంచం పరిచయమయ్యే
మధురక్షణాలు అతడిని వరిస్తాయి
అనుభూతిస్తూ అనుభూతులిస్తూ సాగిపోతాడు
ఆ పాటలో లీనమై వికృతులన్నీ ప్రకృతులవుతాయి
అతనికీ నాకు మధ్య సెలయేటి పాట ప్రవాహం
దాటలేను వదలి వెళ్ళలేను
చిక్కని అడవిలానో
పరిగెడుతున్న రైలులానో
దుంకుతున్న జలపాతంలానో
నెగళ్ళ సెగలానో అతడిని పాటని మరచిపోలేను
ప్రయాణం కొనసాగుతుంటుంది
నాది కాకపోతే మరొకరిది
పాటగాడు సాగిపోతుంటాడు
మనసు జోలెలో ఇన్నిన్ని పాటల్ని దానం చేస్తూ !

*18 8 2008* సాక్షి సాహితి

# నా ఓనమా వి

నా చుట్టూ దట్టమైన మంచులా అతను
నా ఒంటిరితనపు నల్లటి మేఘాలలో
మెరుపులా మెరిసి క్షణంలో
నాపై యుగాల కాంతిని వెదజల్లేది అతను
ఏ భూమిపై ఉన్నా
సముద్రాల ఆవల ఉన్నా
నే పిలిస్తేనే పలికే రాగం!

నాలో విరిసిన పూల పొద
ఊహూఁ
నా ఊహల పూదోటలో నా కోసమే విరిసిన
ఒకే ఒక అపురూప పుష్పం

నా మెలకువను చుట్టేసే
చలిరాతిరి చల్లదనం

నా హృదయంపై
పదే పదే దిద్దుకునే అక్షరం
నేను రోజు వల్లెవేసే పారం !

ఖాళీ సరస్సులా ఎదురుచూపు నాది
పరవళ్లు తొక్కే ప్రవాహం అతను

ఈ అపరిచిత జీవితానికి వెల్లువయ్యే పున్నమి వెన్నెల
అతనిలో స్వేచ్ఛగా ఎగిరే గువ్వపిట్టను నేను
ఆ ఆకాశానికి హద్దులు లేవు !

# అరణ్య

ఇంటి చుట్టూ పాతిన వెదురు చెట్లను
మనసు చుట్టూ పాతానా
శాశ్వతంగా నాటుకున్న అలవకు వచ్చిన చిగుళ్ళు
చిగుళ్ళన్నీ అరణ్యమై
పిట్టల్లా వచ్చి వాలే కలలు
ఎవరూ చూడకుండా
ముళ్ళు గీరుకున్నా
దూరి వచ్చిన ఒక మేక పిల్ల

ఆకులమీద గాలిలో అవలీలగా ఎగురుకుంటూ
చైనా జానపద నాయకుడిలా ఎందుకలా
హృదయంలోకి
ఈ కీకారణ్యంలోకి?

కలల రెక్కల్ని కత్తిరించలేక తన్లాడుతుంటే
ఇన్నేళ్ళ క్రమశిక్షణనో ప్రశాంతతనో
అనివార్యంగా ఎందుకు చెరిపేస్తావు?
విరగబూసిన మల్లెతోటలో ఎంతసేపని
ఒక్కదాన్ని మతిపోగొట్టుకుంటూ తిరగను

చేరుకోలేని తీరానివని తెలిసీ ప్రయాణం
ఎదుర్రావని తెలుసు
వీడ్కోలివ్వవని తెలుసు
కనీసం మాటైె పలకరించు!

రాత్రినంతా ఆక్రమించే నువ్వూ చీకటి!
తెల్లారినా మనసును వీడని మసక!

సాక్షి సాహితి

# అన్వేషణ

జీవితం కొత్తని కోరుకుంటుంది
పరిచయమవుతున్న కొద్దీ పాతయిపోతుంటే
పాతబొమ్మల్ని విసిరికొడుతున్న పసికూనలా

అడుగేస్తున్న కొద్దీ భూమి కనిపిస్తూ పోతుంది
పచ్చని పంటలా మైదానంలా
రాసిరాసి విసిరికొట్టిన నోటుపుస్తకంలా

పిల్లాపాప గొడ్డుగోదా సంసారం
అబ్బాహ్ రోజు తినే అన్నంలా
అదే రుచి
జీవితం మొదలు నుంచి చివరి వరకు

ఇంకా ఏదో కావాలి
అసలేం కావాలో తెలిస్తే ఎంత బావుండు ?

# ప్రకృతి రాసిన ప్రేమకవిత్వం
# పూలు

# మృత్యువుకో ప్రేమలేఖ

నువ్వే నా ప్రేమికవని తెలిసీ
పక్కదార్లు తొక్కుతానెందుకో

చెత్తబుట్టలా చుట్టూ అన్నీ పేర్చుకున్నాను
నువ్వు కురిసి నన్ను శుభ్రం చేస్తావని తెలుసు

పసిదానిలా అన్నీ దాచుకుంటున్నాను
అమ్మలా నువ్వు బుద్ధులు చెప్తావని తెలుసు

ఎటు నడుస్తున్నా నీ కోసమే ఈ ప్రయాణం
కానీ నువ్వింకా కనిపించనే లేదు

ఎంతకాలం ఎదురుచూపు
ఎప్పుడొస్తావో చెపితే సరిపోదూ!

సుందరయ్య గ్రంధాలయ సంస్థ
ACC No
గచ్చిబౌలి, హైదరాబాద్ 500032

# తారేం

ఎవరో చుక్కలు పెట్టారు
ముగ్గు గీయడం మరచిపోయారు

ఏ పిట్టలకు వలేసారో
ఇన్ని నక్షత్రాలు చల్లారు

నక్షత్రాలకి చలేసిందేమో
మబ్బులను కప్పుకున్నాయి

వెన్నెలంతా ఎవరో కోసుకెళ్లారు
పరిగెలా నక్షత్రాలు

ఏ చంద్రుణ్ణి స్వప్నిస్తున్నదో
నక్షత్రాలు పొదిగిన దుపట్టా కప్పుకుంది

# ఆత్మాభిమానం నా సిరి

పట్నంలో కనపడని తట్టలో
ఆత్మాభిమానాన్ని అమ్ముకోలేను
కమ్ముకున్న ఊరిపొత్తిళ్ళ వాసన వదిలిపోదు

బట్టలకింది అవయవాల కోసం
బట్టలలో దాగిన డబ్బూ దర్పం కోసం
కుక్కల్లా ఒకరి వెంట ఒకరు పడే
ఈ అత్యాధునిక వస్తుమార్పిడికి
ఈ ఊరిగుండె అలవాటు పడదు

ఈ దేహానికో మనసుంది
ఎవరిముందో పొరలుపొరలుగా విడివడడానికి
మల్లెపూవు కాదు

స్వేచ్ఛగా పల్లెలో పెరిగిన మనసు
రెక్కలు విచ్చుకోని అమాయకత్వం

ఏ తెరల వెనుక సుఖం కోసం
ఇన్ని తెరలు కట్టుకోవడం ?

ఆత్మాభిమానం ఇంకని పల్లె చెలిమ
కన్నీరవుతుంది కనిపించేటోళ్ళంతా
తనవాళ్ళనుకుని వలబోసుకుంటుంది
ఎవరి అధికారాన్ని అంగీకరించదు

పట్నంల కనపడని తట్టలో
జ్ఞానమో అజ్ఞానమో అమ్మకం
ఆత్మాభిమానం మాత్రం కాదు
కమ్ముకున్న ఊరిపొత్తిళ్ళ వాసన వదిలిపోదు

# ప్రాణ వాయువు

భూమినుంచి దూరంగా తీసుకుపోబడ్డాను
అన్నింటినీ వరదలో కోల్పోయి
తడిసి ముద్దయిన పిట్టపిల్లవలె
నా గుండె, లోపలెక్కడో బితుకుబితుకుమంటూ!
అమ్మ కొంగును వదిలి మొదటిసారి పట్నంకొచ్చినదానిలా
భూమినొదిలి నేను ఇంకా ఎత్తుకు తీసుకుపోబడుతున్నాను

ఎంత ఎత్తుకు వెళ్తున్నానో
నా మనస్సు క్రిందికి క్రిందికి జారుతుంది!
చిన్నప్పుడు తుమ్మిస్కల్ని నేను పట్టేదాన్ని
ఇప్పుడు పెద్ద తుమ్మెద నన్ను పట్టుకుంది

బయట అకాల వర్షం
గాలికి పగిలిన పత్తికాయలు కొట్టుకొచ్చినట్టు
కుప్పలుకుప్పలు దూదిలా
మబ్బు పరుచుకుంది చుట్టూ !
లోపల పంట కోల్పోయిన రైతులా నేను!

పెదవుల వెనుక కిలోల నవ్వుని దాచి
గ్రాముల లెక్కన పంచుతున్నారు
ఓపికకే మారు పేరు ఈ హోస్టెస్‌లు

రెడ్‌వైన్ సూర్యోదయంలా
వైట్ వైన్ చంద్రోదయంలా
పాసింజర్స్‌ని అలల్లో ఊయలూపుతున్నయి
కిటికీల్లోంచి చూస్తే
వాటర్ టాంక్‌లన్నీ పుట్టగొడుగులే!

కుబుసం విడవని పాముల్లా
సూర్యకాంతిలో లోహం ప్రవహిస్తున్నట్లు
సన్నని గీతలుగా నదులు

ఆ పూలు పళ్ళు మనుషులు పోష్‌కల్చర్
ఏదీ అతకడంలేదు నాకు
నేనో అపరిచితగానే మిగులుతున్నాను ప్రతిక్షణం
ఎంత సంధానించినా సముదాయించుకున్నా
తామరాకుపై నీటి బొట్టులానే!

ముడుచుకున్న పెద్దమొగ్గను
నవ్వించడానికి నేనెక్కిన తుమ్మెద
ఝూమ్మని వాలింది
వికసించిన మట్టిపువ్వు
వెదజల్లిన మట్టిపరిమళం
నాకు మళ్ళీ ప్రాణ వాయువు దొరికింది

(తొలిసారి విమానం ఎక్కినప్పుడు)

*27 09 2012 'నేటి నిజం'*

# దేశాంతర దుఃఖం

నది గడ్డకట్టిన రూపమల్లే ఆమె
నిజంగానే చలికి గడ్డకట్టి నేను
మైన్ నది చిన్నదై పోయింది
మా మాటల ప్రవాహంలో!
ఒక దేశపు హృదయం
          మరో దేశపు హృదయంతో చాలనం కదా!
భాషతో చేసిన సర్కస్ ఫీట్లతో
చచ్చినట్లు భావం మా ముందు
చేతులు  కట్టుకుంది
రాత్రిపూట నా పక్కనే మైన్ నది
అమ్మలా చల్లని గాలి కొంగుతో జోలపాడి నిద్రపుచ్చేది

ఎంతందం సలీమా నీది!
దు ఖం గడ్డకట్టిన మంచుశిల్పంపై
చిక్కని చీకటి వంకర్లు తిరిగిన గిరిజాల జుట్టు
ప్రకృతంతా విరగబూసి నవ్వినట్లు నడిచినట్లు ఓహ్!
కానీ
దేశాలు దాటి, నదులు, సముద్రాలు దాటి వెళ్ళినా
వెంటాడిన ఒక కన్నీటి పడగ  !
దు ఖం ఎంతదూరం వెళ్ళినా
వెంటే వస్తుంది   వెంటాడుతుంది!

మైన్ నదిప్పుడు
నగరాన్ని చుట్టుకున్న నీటిచిలువలా
నగర దు ఖమంతా కలిసి నదిగా
కాదు, గడ్డకట్టిన మంచుశిల్పం సలీమా
కొద్ది కొద్దిగా కరుగుతూ
ఇక్కడి దు ఖాన్నంతా వదులుకుని వెళ్ళానా
మళ్ళీ సలీమా అయ్యి
నల్లని మేఘమై సన్నని మంచై
ప్రవహించే నదై వెంబడిస్తూనే ఉంది
మాటల పిట్ట బెటీనాలానో మరోలానో కాదు
బాధల వరదనదిలా!
"సాజహానా యు ఆర్ మై బెస్ట్ ఫ్రెండ్!"
దేశాంతరాల స్నేహం
దేశాంతరాల దు ఖం
ఇద్దరు మగవాళ్ళు కలిస్తే లేని దు ఖం
ఇద్దరు స్త్రీలు కలిస్తే ఎందుకో
జవాబు ఇంటర్నెట్‌లో కూడా దొరకదు

ఆకాశంలో ఏ సింగిడులు లేని తెల్లని మబ్బు ముద్దలు
అచ్చం సలీమాలా
"నాకో కొడుకున్నాడు " అంటూ చెప్పబోయి
ఆపుకున్న తెల్లని దు ఖం
"సలీమా ఫ్రమ్ మొరాకో!"

*(ఫ్రాంక్‌ఫర్ట్‌లో 14 రోజులు నాకిచ్చిన స్నేహితురాలు సలీమా కోసం)*

*'పాలపిట్ట' అక్టోబర్ 2012*

# దర్గా దారికి అంటు లేదు

చక్కెర ఉండలో పప్పు గింజలా
వాళ్లూ మేమూ

దర్గాల కెళ్లే దారులకు
అంటు లేదు

అంటు లేని మనసులు
అలాయిబలాయి తీసుకుంటాయి

యాకన్న దర్గా కాడ
పది పైసలకే పట్టెడు జిట్టీత పండ్లు
జ్ఞాపకాలు మోదుగాకులో ఈతపండ్లయి ఊరిస్తున్నయ్

బాల్యం తిరుగాడిన దర్గా
మాయమయిన గుర్రానికి గుగ్గిళ్లు
పెద్ద పెద్ద మర్రి చెట్లు
యాకూబ్ సాబు అభయహస్తాల్లాగా
చల్లగ కూసుంటె నిద్రనిచ్చేటోడు

అంటరానితనం
ఆలయప్రవేశం జరిగిందని
శుద్ధి చేసుకోవడం చూస్తుంటే
అందరినీ
అలాయిబలాయి తీసుకునే
దర్గాలు
ఇప్పుడు ఆకాశమంత కనబడుతున్నయ్

*జూలై 2006 'అలావా' ముస్లిం సంస్కృతి కవిత్వం*

# నల్ల బతుకు

నల్లని బొగ్గే
గిన్నెల తెల్లని మెతుకులై
ప్రాణాలు నిలుపుతదని కన్న కలలు
బొగ్గుపొయి పొగలాగ జ్ఞాపకాలు
భూమిలోపల నల్లని జెన
నన్ను పెంచిన ఇల్లెందా!
నువ్వు పైలంగున్నవా?

తవ్వుకుంటపోతే బొగ్గుపడ్డట్లు
రాసుకుంటపోతే ఎన్నెన్ని కడగండ్లో
పైనొక బతుకు లోపలొక బతుకు
లోన మైళ్ళదూరం రాకాసిదార్లు
ఏ నీటి ఉప్పెన మృత్యువై మూసుకుని పోతుందో
పెళ్ళలుగా రాలిపడే బొగ్గు మట్టి
కంపెనోడి నిర్ణయాల్లాగే
ఎప్పుడు లోపల్లోపల హత్యిస్తాయో
మట్టిపొరల వలల్లో
బొగ్గుకోసం చిక్కుకున్న ప్రాణాలు
దినదిన గండం దినపోరాటం చేసే
ఈ శ్రామికులు సైనికులు కాదంటవా?
బొగ్గునంతా బయటకు తెచ్చి

ప్రపంచానికి వెలుగు నిచ్చినా
తమ బతుకుల్లో రాక్షసిబొగ్గంత కమ్మిన చీకటి

జీతం ఎత్తుకున్నరోజు ఏక్‌దిన్‌కా సుల్తాన్
పొద్దుగూకంగనే చీప్‌లిక్కర్ మోహినై పిలుస్తుంటది
సారాయి దుక్నం సూడు
రోడ్డుపొంటి పొర్లే దేహాలు
బొయిలల్ల మెలితిరిగిన నరాలు
వళ్ళిర్సుకుంటయ్యాడ
కంపెనీ జులుమూ పుళ్ళుపడ్డ కాళ్ళూ
ఏవీ యాదికి రావు
అయ్య అమ్మ పెండ్లాం పోరలెవ్వరుండరు
చివరికి తను కూడా
ఒక్క సారాయే విశ్వరూప మెత్తుతుంది
రోజంతా కష్టం, కరిగిన రక్తం
వస్తుమార్పిడిలో సారాగా మారుతుంది
తెల్లారినంక
తాకట్టు పెట్టిన సైకిలు
బెల్లు కొడుతుంది దూరం నుంచి
నడవనని మొరాయించే కాళ్ళు
చీప్‌లిక్కర్‌కు ఉరేసుకునే పేగులు
బాదు పోరగాళ్ళను, పెళ్ళాన్ని
బాదుకో తల బొగ్గుట్ట బాయికేసి
ఇల్లిల్లూ ఏడుపుల జాతరే

పేదరికం విషవలయంలో ఈగల్లెక్క
మనుషులెట్లా కొట్టుకుంటరో
సూద్దురు రాండ్రి బొగ్గుగట్టకు!

బొగ్గుల బతికి  బొగ్గుల సచ్చి
బొగ్గుకే అంకితమైనా
బతుకే బొగ్గు పాలయినా
బుక్కెడు బువ్వకు తండ్లాట
బొగ్గుబాయి పనికి పొవ్వద్దు కొడుకో
అమ్మీ ఏడ్చిన ఏడుపు
తరంగాలై సొరంగాలల్లో గింగిరాలు తిరగబట్టె

ఎట్లనో గట్ల మూలిగే బతుకుల మీద
ఓపెన్‌కాస్ట్ లొచ్చిపడ్డయి
పైనుంచి చుట్టుకున్న రాకాసి పాములేవో
నోటికాడి ముద్దని లోపలికి లాక్కపోతున్నయి
జీవన చిత్రంలో నల్లరంగు తప్ప
ఇంకే రుచీ తెలియని భోలీ దునియాఁ !
ఎన్నెన్ని ఆత్మలు బావుల మీదపడి ఘోషిస్తున్నాయో
ఎప్పటికయినా పేర్చిన రాక్షసిబొగ్గు బట్టీ
ఈ గుండెల్లో రగలక పోద్దాని చూస్తూ !

*('భారతి'లో ఎన్నో కవితలు అచ్చయినా, బాయిపనిలో కవితాత్మ పీల్చేయబడి అస్తిపంజరంలా మిగిలి, అర్ధాంతరంగా ప్రాణాలు కోల్పోయిన చిచ్చాకు, ఇల్లెందు మురికి నీరు తాగి కామెర్లయి అర్ధాంతరంగానే చనిపోయిన చిచానీకి)*

*సకల జనుల సమ్మె సందర్భంలో 'చెలిమె' నమస్తే తెలంగాణ*

# మాదిగ బుచ్చమ్మ

ఉరుములు మెరుపులతో ఆకాశం
అచ్చం అమ్మీలా బాధతో మెలితిరిగి పోతున్నపుడు
కుండపోతలా కన్నీరు కళ్ళల్లోనూ పైనుంచీ
గుడిసె చూరు నుంచీ
అబ్బా మనసునుంచీ ఏకధాటిగా నీళ్ళు

ఏంచేయాలో తెలీని నిస్సహాయత
కాలంలో ఇరుక్కుపోయినట్లు
బురదలో కదలనివ్వని అచేతనత్వం
వర్షంలో కదలని చింతచెట్టులా అబ్బా
నొప్పులతో విలవిల్లాడుతూ అమ్మీ

తడుచుకుంటూ ఏకాకి వెళ్ళిచెప్పిందో తెలీదుగాని
బుచ్చమ్మరానే వచ్చింది
బుడ్డిదీపం గుడ్డి వెలుతురులో, అనుభవమే కాంతై
నలుదిక్కులా ప్రకాశించి జీవి బూమ్మీదపడ్డ శబ్దం
అల్లాహు అక్బర్ !
ఎవరో నా నాలుకపైన తేనెరాశారు
నా చెవిలో పేరు ఊదారు

ఎవరికీ తెలీదు కానీ
నా నాలుక స్పృశించిన మొదటి రుచి పేరు బుచ్చమ్మ
నా చెవులు విన్న
పవిత్రమైన మొదటి పేరు బుచ్చమ్మ

నాదిప్పుడు పెరటి తోటకూర కంటే
వేగంగా పెరిగి ఆటలాడే వయసు
నాతోపాటు వెంకడు కూడా ఆడుకోవచ్చని
అమాయకంగా అనుకునే మనసు
కానీ మా ఇంటికి
ఆడుకోవడానికి వచ్చిన మొదటి రోజే
మెడబట్టి తలుపుకవతలగా
అంటరాని ఉండగా విసిరేయబడ్డాడు
వాడు మంత్రసాని
మాదిగ బుచ్చమ్మ మనవడైతే మాత్రం !
నున్నటి వాకిట్లో పొక్కిలైన
పసిమనసుతో నిల్చున్న వాడు
స్థూపంలా నిల్చుండిపోయిన నేను

'బహుజన కెరటాలు' ప్రత్యేక సంచిక

# మనసు మారని రంగు

తెల్లకాయితం పైన నల్లరాతా
నల్లప్రేమికా
నల్లటి మట్టి మనిషా !
ఇప్పటికీ
లోపలి విధ్వంసాన్ని
బయట పెట్టలేక పోతున్నా
చెదరగొట్టబడిన కంటి కాటుక రేఖా
తేలిపోయిన మబ్బుతునకా
బాల్యపు చింతగింజలాటా
నల్ల ప్రేమికా
'చార్‌కోనా'లో
ఏ గదిలో నువ్వు లేవే?
ముట్టుకుంటే ఓడిపోయే ఆటలో
నిన్ను ముట్టుకుంటానేమోనని
నాలుగు దిక్కులా కాపలా!

అమాస రాత్రిన
పరుచుకున్న నా నల్లవెన్నెలా
మనిషికి మనిషి దూరమవుడు
ఏ పరిణామ సిద్ధాంతమో తెలీక
నల్లమొకం వేసుకుని ప్రశ్నిస్తున్నా

ఇంతింత, ఇన్నిన్ని మేధస్సుల మధ్య
ఆవిరయిన కన్నీటి బొట్టా

ముక్కలయిన ఖైర్లాంజి దేహమా
చిందిన లక్షింపేట నెత్తురా
గొంతుపెకలటం లేదు
కులం తెరల వెనుక నల్ల చందమామ
కాలం కంటి కింద నల్లకన్నీటి చారికా
సప్తవర్ణాలు ఇప్పుడు నన్ను ఆకర్షించటం లేదు

మనం ఇప్పుడు నమ్ము కోవలసింది
భూమిని మాత్రమే
ఆమెదీ మనదీ ఒకటే రంగు!

*19 8 2012* ఆదివారం ఆంధ్రజ్యోతి

# తెల్లారని బతుకు

మోకాళ్ల మీద తల పెట్టి
వాకిల్ల కూసుంటే
పర్సుకున్న రెండో వాకిలోలె నా కొంగులోకి నడ్సి రావా
పసిబిడ్డోలె దాసుకుంట !

***

ఏడనో సూర్యుడు కుంగిన చోట
ఏలాడ దీస్తరట నాయనా !
కాలం గడ్డ కట్టిన మనిషిలా కదల అంటుంది
ఎర్రమట్టి, నల్లమట్టి పెట్టి అలికిన అరుగోలె
ఆకాశం అనంతంగా దుఃఖంగా కనబడుతుంది

***

నది గీసిన గీతలు మా నుదుటున తుడిసేసినంక
రాత ఎతుక్కుంట ఏడదాక పోతున్నమో
మా భూమి పుక్కిట్ల నీళ్లు లేక
అయిన పుండ్లోలె మా బతుకులు !

మాన్పుకుందికి పరదేశం బొయినవా కొడకా !
దేశం కాని దేశంల
ఇసుక బుక్కినవో కళ్ల నీళ్లు తాగినవో
రక్తం ఇగరంగా ఎంత కష్టం చేసినవో బిడ్డా !

***

నిన్నొక్కడ్నే అనుకుంటాన్రు ఉరేసేది
ఆ తాడుకే మేమందరం గూడా ఉన్నమని
ఏ దేశపు రాజుకు మొర పెడుదు !

నువ్వు పొయినపుడు కుంకిన పొద్దు
ఇప్పటి దాన్క తెల్లారనేలే

(సౌదీలో ఉరిపశిక్ష పడిన తెలంగాణ బిడ్డల కోసం)

జనవాక్యం, ఆంధ్రజ్యోతి

# ఖర్జా మిర్జా దోస్తానా

ఖర్జా మిర్జా దోస్తానా
బడి తర్వాత రెండో బడి
పుస్తకాల సంచీ నిండా
ఏరుకున్న రేగ్గాయలు !
పద్మ వరమా నాగా ఎక్కడున్నారంతా ?
రేగ్గంపలో చిక్కుకున్న ఓణీలా
ఎక్కడ తట్టుకుని ఉండిపోయాం ?
ఎన్నెన్ని పొదలు వెదికామో ?!
చిట్టి చేతుల్ని ముళ్లు పట్టుకుంటే
చీరిన రక్తం మరకల్ని
ఉమ్ము పెట్టి తుడిచిన
నా ఫస్ట్ ఎయిడ్ నేస్తమా ఎక్కడున్నావే?
నగరంలో కిలోల కొద్దీ
రేగుపండ్లు అమ్ముతున్నారు
మామిడి కాయలు రాసులు పోసి వున్నాయి
ఎన్నిచోట్ల కొన్నా అప్పటి రుచి లేదు
అసలిప్పుడు జీవితమే
పులుపు తీపి బాల్యం కోల్పోయి
చేదొక్కటే మిగిలిన అనుభూతి!
పిందెలకోసం వెదికిన తోటలు

ఎన్ని వసంతాలను విరబూసి ఉంటాయో
నగరం వీధుల్లో కొట్టి పడేసిన మానుల్లా మనం

లక్ష్మీ! పేటెంట్ పొందిన అమెరికా మార్కెట్లో
వేప్పువ్వు దొరికిందో లేదో
నువ్వు ఉగాది పచ్చడి తిన్నావో లేదో
ఓ నా పల్లెటూరా ! నిన్నేమని పలకరించను ?
మొన్న పడ్డ వడగళ్ళ వానకి పూత రాలిందో
జీవితమే రాలిందో

నవమి పానకం, ఉగాది పచ్చడీ
రంజాన్ సేమ్యా, మొహరం మట్కీల షర్బత్
ఇద్దరికీ ఒకే రుచి నిచ్చేవి!
బాల్యం ఎంతందమైన జ్ఞాపకం!
బాల్యం ఎన్నటికీ అబద్ధం కాదు!
పెనవేసుకున్న జీవన సారాంశం అబద్ధం కాదు!
ఇచ్చుకున్న కాకెంగిలి ముక్కలు
పంచుకున్న టిఫిన్‌బాక్స్ ముద్దలు
ఆ స్నేహం ఎప్పటికీ అబద్ధం కాదు !
ఎన్ని బాంబులు పేలినా ఎన్ని గుజరాత్రులు గడిచినా
ఎన్ని ఖైర్లాంజీలు ఎన్ని సునామీలు భయపెట్టినా
సహజీవన సహవాసం మా అందరిది !

# ది స్ప్రింగ్ ఈజ్ వెయిటింగ్

నీటిపై మోహంతో మునిగి
విత్తనం పై పారేదో పగిలిన శబ్దం
హృదయం రేగుపూల పొద
గుమ్మెత్తించే అడవి పరిమళం
పేరు తెలీని పూల గుంబస్
ఆకు లేకుండా పూసిన పూల పరుపు
పిట్టలు ప్రవహిస్తున్న చెట్లు

ల్యాప్ టాప్ సమాధి ముందు
మోకరిల్లుతున్న  సజీవ శవాలు
కళ్ళల్లో కాంతిని గ్రహించి
రెట్టింపు కళతో నవ్వుతున్న ఎల్‌సిడిలు
జీవం తప్పిపోయింది గూగుల్‌లో సెర్చింగ్
అద్భుతమైన నయాగరా జలపాతం
స్క్రీన్ మీద పరుచుకున్న పచ్చిక మైదానం
ప్లాస్టిక్కీబోర్డు మీద వేళ్ళ సల్సా నృత్యం
ప్రస్తుత సమయం
ఒంటరి విషాదం దుమ్ము రేగుతున్న యుద్ధ మైదానం

దేహం  దేహాన్ని తాకడమూ తెలియాలి
మనసు మనసుతో కలవడం మరింత తెలియాలి

ఆదివారం వార్త

# ఫూల్ ఝడి

నాదేహం చుట్టూ అతనల్లిన కవిత్వం
చీర
*
మనసు పొత్తిళ్ళలో పసిపాపై అతను
నేనెటు వెళ్తే అటే
*
నా నిద్రను తొలుస్తూ అతను
కలలగూడో?రాత్రి ధ్వంసమో?
*
ఇహంలో ఎంత ముంచినా మునగడం లేదు
మాట వినని మొండిపిల్ల మనసు
*
తరతరాల దాహాన్ని తీర్చుకున్నట్లున్నాడు
నా కన్నీళ్ళను అంతగా తాగేస్తూ
*
తొలకరికే మనసుకు గండిపడితే
వానా కాలమంతా ?!
*
ఎక్కడో ఉన్నట్లే ఉంటాడు
నా చుట్టూ వరదగుడిలా అల్లుకొనిపోతాడు
*
అబద్ధాలకు నాలుక చాలు
నిజం చెప్పడానికి గుండెకావాలి
*
వర్షంలో భూమి తడిసినట్లుంది మనసు
ప్రేమలో పడ్డట్టుంది

*25 07 2010* ఆదివారం ఆంధ్రజ్యోతి

# ఎ జర్నలిస్ట్ నైట్

గడపలో కుప్పపోసుకు కూర్చున్న
  చూయింగమ్ రాత్రి
నిద్ర కళ్ళెం పట్టి
అర్ధరాత్రిదాకా తీస్కెళ్ళినా మొరాయించే మనసు
చెప్పాలని, బతకమ్మలా పేర్చిన ఊసులు
గమ్యం చేరకుండానే నిద్రలోకి జారిపోయే చిన్నారుల కళ్ళు
కాలానికి గుచ్చిన సాయంకాలాలు  వేజ్‌లో పూలు
చీకటి రంగేసి  రాత్రిలో కలిపేసిన హృదయాలు, కోరికలు!

ఒడిలోనో మరోలానో సేదతీరాల్సిన జీవసమయాలు
టీ  కాఫీ  సిగరెట్ సుడుల్లో
అల్సర్లో మరోటో పొందే పేగులు
వెంటాడి వేటాడాలని చూసే రాజకీయం
తలవంచని కలంలో రాత్రి సిరా  పొద్దుటి కాగితంపై
నక్షత్రాల్లా మెరిసే అక్షరాలు
రాత్రిని కోల్పోయి నిర్వాసితంగా నడుస్తూ

చెదిరిన అక్షరాల్లా
ఆరుతూ వెలుగుతూ మిణుగురుల అపరాత్రి!
బండిలేని కొత్త విలేకరి
కళ్ళనించి జారకుండా సతాయించే
అసహనపు రాత్రి!
మానలేక    చెయ్యలేక ఊరికి పట్నానికి మధ్య
పొడుగైన గతుకుల రోడ్డులా రాత్రి
న్యూస్  కాలమ్  ఎడిటింగ్  టెన్షన్‌లో
నలిగిన కాగితం ఉండయ్యే దేహం
మరో దేహపు ఆలింగనంలోనూ
విప్పి విసిరి పారేయలేని అవే ఆలోచనలు

తెల్లారితే పరిమళం విశ్వవ్యాప్తం
రెక్కలు వేలాడేసుకుని ఈ రాత్రి పువ్వు!

*నవ్య వీక్లీ, 2011 దీపావళి ప్రత్యేక సంచిక*

# అనిషేధ

రాసేదంతా కవిత్వమే అయితే
జైళ్ళన్నీ కవులతో నిండేవి
ఇన్నిన్ని నిషేధాల మధ్య
గొంతు విప్పడం ఎలా ఉంటుందో
ఒకసారి చూడు
ఒక కలైనా కను

రాసే మనిషికి నిషేధాలుండవ్
రాసే మనిషికి జైళ్ళుండవ్
దునియా అతడికి మట్టిల్లు

జనం ఆవహించిన వాడు
జనపదాల్ని భుజానేసుకునేవాడు
భుజకీర్తుల్ని ఆశించడు
మట్టిలో పుట్టిన వాడు
మట్టి మనుషులతో చేరినవాడు
వేరే ఏ పదార్థాన్ని ఆచ్ఛాదించడు

ఎవరి భయాలో నిషేధాలవుతాయ్
ఎవరి తప్పులో రూపాంతరం చెందుతాయ్
నిషేధిత ప్రాంతాలుండవ్ అతడికి
ఇరుకిరుకు భావాల్ని పేర్చలేడు

సూర్యుడు కుంకే చోట
అక్షరాలకి అద్దడం కోసం
రంగుల్ని కోస్తూ కనిపించాడా అతడే
దేశదేశాల్లో నిజం మాట్లాడి నిషేధానికి గురైనవాడు

కాలికి తెలీకుండానే
నేల నిషేధ ప్రాంతమైనపుడు నిలదీస్తున్నవాడు
అతడు నడుస్తుంటాడు
పాదముద్రల ఓనమాలు వదుల్తూ
బందూఖులూ బాంబులూ బలాదూర్
చరిత్ర అతడి రక్త సంతకాల్ని ఏరుకుంటుంది

*21 05 2007* ఆదివారం ఆంధ్రజ్యోతి

# బూషాడా.. గో బ్యాక్!

చేతులు తెగిన ఇరాక్ పిల్లాడిలా
ఇవాళ నేనిక్కడ
దేహమున్నా లేనిదానిలా

పసిపిల్లలు కదా
బూచాడంటే తెలుసు కాని
బుష్ అంటే ఏం తెలుస్తుంది ?
రాక్షస రెక్కలతో తల్లుల్నీ తండ్రుల్నీ
ఎత్తుకెళ్తున్న నరహంతకుడని తెలిశాక
చందమామ కథలెట్లా చెప్పుకుంటారు?
తెగిన ఆ చేతుల్నే
ఆయుధాలు చెయ్యకుండా ఎలా ఉంటారు !

పాలస్తీనా ఆఫ్ఘన్ ఇరాక్
వాడు ఒక్కొక్క దేశాన్నే
మింగుతూ వస్తున్న అనకొండ

తన రక్తంతో పరుల పాపాలను కడిగిన ఏసు
తన దాహంకోసం పరుల రక్తం తాగుతూ బుష్షు
భూగోళం మీద ముళ్ల కిరీటాన్ని
గుచ్చుతున్న నరహంతకుడా  గోబ్యాక్ !

పున్నాగ పూల లేత వాసన స్నేహాలు
ఏవీ మా బంగారు బాల్యాలు
హెచ్‌బిఓ ఏఎక్స్‌ఎన్ చక్రాల కింద పడి
నుజ్జయిన మా మేధస్సులు
వాడి హారర్ థ్రిల్లర్ సినిమాల ముందు
చెప్పుకున్న దెయ్యం కథలన్నీ
సమాధుల్లోకి పారిపోతున్నాయి
రాత్రిళ్లు పేదరాసి పెద్దమ్మ  నానిమా  దాదీమా
ఒంటరిగా తిరుగుతూ ఏడుస్తున్నారు

ఇప్పుడు చేతవెన్న ముద్దల్లేవు
చేతికి మెహిందీల్లేవు
పిజ్జా బర్గర్ల రెడీమేడ్ పెంట తప్ప!

వాడొస్తున్నాడంటే
మా గంజి నీళ్ల మీద
గద్ద తిరుగాడుతున్నట్లుంది
రక్తం ఓడుతున్న
ఇంగ్లీషు దెయ్యం నడిచొస్తున్నట్లుంది
వాడి దిష్టి కళ్ల నుంచి
నా దేశాన్నెలా కాపాడుకోను

చుట్టూ సముద్రాల నీటిలో కడిగినా
వాడి చేతుల రక్తం పోదు
ఆ చేతులతో కరచాలనం ఎలా చేస్తాం ?!
వేయి నాలుకలు చాస్తూ
నస్తున్న వింత జంతువు
వాడికెలా స్వాగతం పలుకుతాం ?!

*02 03 2006* జనవాక్యం, ఆంధ్రజ్యోతి

# నువ్విప్పుడు నా భూమివి

తన శ్వాసను వంటినిండా
అత్తరులా పూసుకుని జీవిస్తున్నాను
నా భూమి మీది ప్రేమలా
నీ మీది ప్రేమను మర్చిపోలేక పోతున్నాను
నా నేల మీది
మట్టి గంధాన్ని రాసుకున్న క్షణాన్నే
ఉద్యమం ఊపిరి పోసుకుంటుంది
నా దేహం నిండా
ప్రవహిస్తున్నది రక్తం కాదు
నా ప్రాంతపు ఊపిరులే

ఎవరో నా ప్రేమను
నా నుంచి లాక్కుంటున్నారు
ఎంత క్రూరులై ఉంటారు
దక్షిణాఫ్రికా గూడెం ప్రజలను ఎత్తుకుపోయినట్లు
నా ప్రేమను హైజాక్ చేస్తున్నారు

నిన్ను అమితంగా
నా ప్రాణం కన్నా మిన్నగా
ప్రేమిస్తున్నందుకు గాను
హిట్లర్లయి నా ప్రేమికను నా నుంచి
లాగేసుకుందామని చూస్తున్నారు

చూడు!
వేల ప్రేమికులు యూనివర్సిటీల నిండా
లారీల కింద విరిగింది
దేహమా    ఈ నేల కాదు ?
ప్రవహిస్తున్నది రక్తమా
ఇన్నాళ్ళు లోపల్లోపల తెర్లుతున్న
నా ప్రాంతపు నీళ్ళు కాదూ
వీళ్ళంతా నా ప్రాంతపు చంఘీజ్‌ఖాన్‌లు,
స్పార్టకస్‌లు, చేగువేరాలే

తల్లులంతా తమ కొడుకులను
బంగారు గాజులు తీసి జోలెలో వేసినట్లే
ఉద్యమం ఒడికి ఇచ్చేస్తున్నారు
మీ కొంగులను కళ్ళకు గంతలు కట్టుకోకండి
మీ కలాలను శాలువాల కింద దాచేసుకోకండి
అవి కూడా మిమ్మల్ని ఏకాంతంలో ప్రశ్నిస్తాయి
కవి అన్నవాడు
స్వేచ్ఛకు చేయందించాలి కదా అని

ఎంతో దు ఖంగా ఉంది
కానీ తీయగా ఉంది
ఎంతో బాధగా ఉంది
కానీ భరించాలని ఉంది
ఎంతో ఉక్రోషంగా ఉంది
కానీ పోరాటం నరాలు తెంచుతోంది

నా నిరాహార దీక్ష
నా ప్రేమను గెలిపించేంత
శక్తివంతంగా ఉంది
ఎపుడయినా నా ప్రాంతపు
మట్టిని రుచి చూశారా
నా ప్రేమికుడు నాకిచ్చిన
తొలి ముద్దులా ఉంటుంది

నేను వేరు నా నేల వేరు కాదిపుడు
నా తల్లీ తండ్రీ నీరూ నిప్పూ
ఆఖరుకి నేను కూడా వేరు కాదు
నా ప్రాంతమే
నువ్వు నా దేహంలో భాగం అయితే
కని పక్కన పెట్టే దాన్ని అందరిలా
కానీ ప్రేమికా!
నువ్విప్పుడు నా ఆత్మలో భాగానివి
నా భూమివి !

*11 01 2010 'వివిధ' ఆంధ్రజ్యోతి*

# మేరా హైదరాబాద్

నా ఆత్మ ఈ షహర్ చుట్టూ
పిట్టలా గిరికీలు కొడుతుంది
అనుభూతుల్ని ఏరుతుంటుంది
పుల్లా పుల్లా నెలనెలా కట్టి
గూడులో నిశ్చింతగా నిద్రపోతుంది
ఏం పోగొట్టుకుని ఇక్కడికి వచ్చినా
ఏదో ఒకటి దొరికిస్తుందీ అమ్మ!

ఈ షహర్ ఒక షాయర్
ఇక్కడి జిందగీయే ఒక షాయరీ
రాత్రిని పాన్‌బీడా చేసి
తెల్లవార్లు ఎర్రని ముషాయిరాల్ని పండిస్తుంది
నక్షత్రాల దుపట్టా కప్పుకున్న ఈ షహర్
దుల్హన్‌లా ముస్తాబవుతుంది

మొజాం జాహి బజారు పూలజడై
పేర్చిన పండ్లన్నీ నాగరమై
ప్రతిరోజూ గుబాళిస్తుందీ నగరం
ఇరానీ చాయ్ కమ్మదనపు రుచి
ఇరు మతాల దోస్తానాను గుర్తు చేస్తుంది
హైదరాబాదీ బిర్యానీ ఘుమఘుమల ధూమాలు
భూమి చుట్టూ సాంబ్రాణీ పొగలై అలుముకుంటాయి
రాత్రి కూడా పగలై విచ్చుకునే
రాత్రీ పగలూ తేడాలేని కష్టజీవి ఈ నగరం

ఈ చార్‌సౌ సాల్ షహర్ బిడ్డలు
సంపాయించడానికే బతకడం లేదు
ముల్లెలు దాచుకోవడానికే జీవించడంలేదు
భూమిని చాపలా చుట్టి చంక కింద పెట్టుకునే
రియల్ ఎస్టేట్ వ్యాపారులు కాదు వాళ్లు
నగర జీవనానికి నాడీ వాళ్లు
షహర్ వాళ్లకు అమ్మ
నగరానికి నిజమైన వారసులు వాళ్లు

ఆ కళకళలాడిన నా హైదరాబాద్ ఏదీ?
ఆ సంస్కృతిని నాగరికతను ధ్వంసం చేస్తున్నదెవరు?
ఆక్రమణ చేసిందెవరు?
ఆశల్ని భుజాల మీదేసుకొని వలసొచ్చిందెవరు?
ఉన్న నాలుగు పచ్చని తలల్ని తెగ నరికి
బిల్డింగులు కట్టిందెవరు?
రోడ్లని వాహనాల ప్రవాహం చేస్తూ
కాలుష్యమని గగ్గోలెత్తడమేంటి?
మీ పచ్చదనాల్ని నదీమతల్లుల్నీ
కావ్యగానం చేస్తూ కాపాడుకుంటూనే
బతుకిచ్చిన నగరాన్ని కులట అంటారా?!
పరిశ్రమలంటూ సెజ్‌లంటూ తల్లినే తార్చాలని
చూస్తున్నది మీరే కదా
మా కంచం ముందు మెతుకు మెతుక్కి
మేకులు కొడుతున్నది మీలాంటి వాళ్లే కదా
మిమ్మల్ని పెంచి పోషిస్తున్నందుకే కదా
మీరు అంతంత మాటలంటున్నదీ
బిడ్డల్ని సాదడానికి ఏ పేరును మోసినా సరే
అమె మాకు అమ్మే

కడుపు చేతుల పట్టుకొస్తే కన్నీరు పెట్టిన నగరం
మీకింత చోటిచ్చింది
ఆకలి తీర్చి అమ్మయింది
గిరి గీసుకొని లేదు పొమ్మని మీ మొఖాన
తలుపెయ్యలేదు చూడూ
అలాంటి అమ్మను 'లం ' అని తిడతారా?
మీలాంటి లక్షల కృతఘ్నుల్ని
ఒడిలో మోస్తున్న నా హైదరాబాద్
అల్లావుద్దీన్ చేతిలో
ఎన్నటికీ ఆరని అద్భుత దీపం
మేరా హైదరాబాద్ !
తుఝే సౌ బార్ సలాం !!

*12 1 2009 'వివిధ' ఆంధ్రజ్యోతి*

## షాజహానా పుస్తకాలు

'నఖాబ్' ముస్లిం స్త్రీ కవిత్వం ఫిబ్రవరి 2005
'అలావా' ముస్లిం సంస్కృతి కవిత్వం సంపాదకత్వం
(స్కైబాబ తో కలిసి 2006)
'చాంద్‌తార' (స్కైబాబ తో కలిసి) మినీ కవిత్వం ఏప్రిల్ 2009
'దర్దీ' షాజహానా కవిత్వం నవంబర్ 2012
10 కథలు, ఎన్నో వ్యాసాలు రాశారు పుస్తకాలుగా రావలసివుంది
పిహెచ్‌డి గ్రంథం
'తెలుగులో ముస్లింవాద సాహిత్యం' పుస్తకంగా రాబోతున్నది

## అవార్డులు

'ముస్లింవాద కవిత్వం వస్తు, రూప వైవిధ్యం'
అంశంపై ఎం ఫిల్ గ్రంథానికి గోల్డ్ మెడల్
రంగవల్లి మెమోరియల్ కథా అవార్డు 2000
సంస్కృతి పురస్కారం 2005 (ఢిల్లీ)
రంగినేని ఎల్లమ్మ అవార్డు 2005

## విదేశీ పర్యటన

భారత ప్రభుత్వం తరపున గౌరవ అతిథిగా
ఫ్రాంక్‌ఫర్ట్ బుక్‌ఫేర్ (జర్మని) 2006
మాస్కో బుక్‌ఫేర్ (రష్యా) 2009 లలో కవితా పఠనం

సుందరయ్య గ్రంథాలయ సంస్థ
ACC No
గచ్చిబౌలి, హైదరాబాద్ 500032

* దర్దీ షాజహానా కవిత్వం

షాజహానా

కవిత్వం

# దర్దీ



పుట్టాక నా తాలూకు మాయను పాతిపెడితే
ఆప్యాయంగా తనలో కలుపుకున్న ఈ మట్టి బిడ్డను నేను!
నా తల్లిమట్టి మీదనే ఇవాళ పూచీకత్తు అడుగుతున్నారు?

***

నా తల్లీ తండ్రీ నీరూ నిప్పూ
ఆఖరుకి నేను కూడా వేరు కాదు - నా ప్రాంతమే
నువ్వు నా దేహంలో భాగం అయితే
        కని పక్కన పెట్టే దాన్ని అందరిలా
కానీ ప్రేమికా!
నువ్విప్పుడు నా ఆత్మలో భాగానివి
నా భూమివి..!

***

పాతబస్తీ తరఫున
నిరాహారదీక్ష చేస్తూ నిలబడ్డ చార్మినార్
నాలుగు చేతులతో
        నిరసన వ్యక్తం చేస్తూ చార్మినార్..

***

ఈ భూమి మీద నీ పాదమెంతో నా పాదమూ అంతే!
అయినా కాలు బయటపెట్టడానికి నాకు అవకాశమే లేదు
అలసిన నా మనసు ఆనుకోవడానికి ఇక్కడ స్థలం లేదు
మరో గ్రహం ఏదైనా ఉందేమో వెతుక్కోవాలి!

నసల్
కితాబ్ ఘర్

